క్లుప్తంగా

డాక్టర్ బాదంకు పూర్ణకుంభం పురస్కారం



బాదం బాలకృష్ణకు అవార్డు అందజేస్తున్న హైకోర్టు జస్టిస్ కృష్ణమోహన్, ప్రముఖులు

బాలాజీచెరువు: నగరానికి చెందిన సంఘ సేవకుడు డాక్టర్ బాదం బాలకృష్ణకు రాజానగరంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో సేవారంగానికి సంబంధించి పూర్ణకుంభ పురస్కారం ప్రదానం చేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు.

స్ఫూర్తి ప్రదాత లూయిస్ బ్రెయిలీ



బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బ్రెయిలీకి నివాళులర్పిస్తున్న సుబ్బారావు తదితరులు

కాకినాడ రూరల్: అక్షరాలను చుక్కల కూర్పుతో అంధత్వం గల వారు సులభంగా నేర్చుకునేలా బ్రెయిలీ లిపిని సృష్టించి అంధులకు స్ఫూర్తి ప్రదాతగా లూయిస్ బ్రెయిలీ నిలిచారని గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం లూయిస్ బ్రెయిలీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ చిత్ర పటానికి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, కృష్ణ, ఫణీంద్ర యోగి, సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.

శేషశయనుడిగా సీతారామస్వామి



బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు శేషశయన అవతారంలో భక్తులను దర్శనమిచ్చారు. స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ధన్వంతరిగా వేణుగోపాలుడు

ధనుర్మాస వ్రత మహోత్సవాలు, రజిత అలంకారం ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక దేవాలయంవీధిలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ధన్వంతరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం దాతల సహకారంతో 2 వేల మందికి ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఏర్పాట్లు చేశారు.

పదోసారి రక్తదానం

కరప: మండలం వేళంగి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గరగ జెమ్మీ పదోసారి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. పెనుగుదురు గ్రామానికి చెందిన ఎం.దేవికి అత్యవసరంగా రక్తం అవసరంకాగా కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు జెమ్మీకి విషయం చెప్పడంతో స్పందించి కాకినాడ ప్రభుత్వ బ్లడ్‌బ్యాంక్ వెళ్లి పదోసారి రక్తదానం చేశారు.

నేడు కాకినాడలో సీ పోర్ట్స్ సిల్వర్ జూబ్లీ మారథాన్

కాకినాడ రూరల్: సూర్యారావుపేట న్యూ ఎన్టీఆర్ బీచ్‌లో కాకినాడ సీ పోర్ట్స్ సిల్వర్ జూబ్లీ మారథాన్ రన్ ఆదివారం ఉదయం జరగనుంది. ఎవేర్‌నెస్ ఆన్ చైల్డ్ క్యాన్సర్ అనే నినాదంతో చిన్నపిల్లల్లో ప్రబలుతున్న క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించేలా మారథాన్ రన్ నిర్వహిస్తున్నట్టు సీ పోర్ట్స్ సీఓఓ మురళీధర్ తెలియజేశారు. ఉదయం 5.45 నుంచి హాఫ్ మారథాన్, 10 కిలో మీటర్లు, 5 కిలో మీటర్లు, 3 కిలో మీటర్లు రన్ నిర్వహించనున్నారు. విజేతలకు బహుమతులు, పాల్గొనే వారికి టీ షర్ట్‌లు అందించనున్నారు. పోటీల అనంతరం సర్టిఫికెట్లను బహూకరించనున్నారు.

పాత నిందితుల బైండోవర్

కరప: మద్యం, నాటుసారా అక్రమ విక్రయాల్లో పట్టుబడిన పాత నిందితులపై బైండోవర్ నమోదు చేసినట్టు తాళ్లరేవు ఎస్ఈబీ సీఐ జేవీ భవాని శనివారం తెలిపారు. మండల పరిధిలో పలు గ్రామాల్లో నాటు సారా, అక్రమ మద్యం విక్రయిస్తూ 33 మంది పట్టుబడ్డారని, వీరందరినీ బైండోవర్ చేసి తహసీల్దార్ పి.శ్రీనివాసరావు సమక్షంలో హాజరుపరిచినట్టు ఆమె చెప్పారు. ఎస్ఐ ఎంవీవీబీ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు

సంక్రాంతి సందర్భంగా 25 మందిపై..

సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 25 మందిపై బైండోవర్ నమోదుచేసినట్టు కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

విప్లవాత్మకం.. ఆరోగ్య రంగం

- పేదలకు చేరువచేసేందుకు సీఎం కృషి
- పార్లమెంట్ సభ్యురాలు వంగా గీత
- రూ.1.89 కోట్లతో యూపీహెచ్‌సీ ప్రారంభం
- పాల్గొన్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ పద్మశ్రీ తదితరులు

కాకినాడ: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన విప్లవాత్మకమైన మార్పుల వల్ల ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిందని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. స్థానిక దుమ్ములపేటలో కాకినాడ సీ పోర్ట్స్ సంస్థ (కెఎస్‌పీఎల్) సహకారంతో రూ.1.89 కోట్లతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీ గీత, జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కేఎస్‌పీఎల్ ఎండీ కేవీ రావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టవంతం చేయడంతో పాటు అన్ని ప్రభుత్వాస్పత్రుల ఆధునీకరణ, మెరుగైన వసతుల కల్పనకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీని కేవలం నెలల వ్యవధిలోనే అందుబాటులోకి తెచ్చిన కేఎస్‌పీఎల్‌ను అభినందించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రి నిర్మాణంతో పాటు అవసరమైన మౌలిక వసతులను కూడా కల్పించేందుకు కేఎస్‌పీఎల్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో సిటీ నియోజకవర్గంలో అదనంగా ఏర్పాటు చేసిన 9 పీహెచ్‌సీలతో కలిపి ప్రస్తుతం 14 వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ యూపీహెచ్‌సీ సేవలను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్ల వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, కేఎస్‌పీఎల్ సీఈవో మురళీధర్, డీఈ మాధవి, ఏఈ నాగేశ్వరరావు, మత్స్యకార నాయకులు కాటాడి జానకి రామ్, స్థానిక నాయకులు వాసుపల్లి కృష్ణ, ఎరుపల్లి సీతారామ్, వాసుపల్లి రాంబాబు, ఎరుపల్లి సత్యం, మోసా పేతూరు, పేర్ల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. కాగా దుమ్ములపేట ప్రాంతంలో రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన కూరగాయలు, చేపల మార్కెట్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రారంభించారు.

అబద్ధాలు మాట్లాడితే ఖబడ్దార్..

- బహిరంగ చర్చకు సిద్ధమై నీ విలువ పెంచలేను
- దమ్ముంటే డివిజన్ వారీ అభివృద్ధిపై చర్చకు రెడీ
- వనమాడిపై మరోసారి ద్వారంపూడి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: రానున్న ఎన్నికల్లో టిక్కెట్ రాదేమోనన్న భయంతో టీడీపీ అధిష్టానం మెప్పు కోసం మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నోటికొచ్చిన అబద్ధాలు చెప్తున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మండిపడ్డారు. స్థానిక డి కన్వెన్షన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి–అవినీతిపై చర్చకు సవాల్ చేస్తే ద్వారంపూడి సమాధానం ఇవ్వడంలేదన్న కొండబాబు వ్యాఖ్యలపై ఎమ్మెల్యే స్పందించారు. ×బహిరంగ చర్చకు సిద్ధమై నా పక్కన కూర్చోపెట్టుకుని నీ విలువ పెంచలేను. నువ్వు చేసిన అవినీతి, తప్పుల వల్లే ప్రజలు గత ఎన్నికల్లో ఓడించారు అని వనమాడిపై ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నంతసేపు అవినీతి, అక్రమాలు, సొంతలాభమే తప్ప నమ్ముకున్న కేడర్‌కు న్యాయం చేయలేదని, ఏ ఒక్కరికీ సరైన నామినేటెడ్ పదవి కూడా వేయించలేకపోవని విమర్శించారు.

జగన్‌ను కలిసిన మాట వాస్తవం కాదా?

పదవి కోసం తాను ఏనాడూ వెంపర్లాడలేదని ద్వారంపూడి స్పష్టం చేశారు. 9 నెలలు ఎమ్మెల్యే పదవిని వదులుకుని బయటకు వచ్చానన్నారు. పదవీకాంక్షతో వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని జైలు వద్ద కలిసిన మాట వాస్తవం కాదా అని కొండబాబును నిలదీశారు.

మూడో వంతెనపై అన్నీ అబద్ధాలే

మూడో వంతెనను తన స్థలం మీదుగా ఎలైన్‌మెంట్ మార్చుకుని రూ.37 కోట్లు ప్రభుత్వం నుంచి పరిహారంగా పొందేందుకు కొండబాబు ప్రయత్నించారని ద్వారంపూడి మరోసారి ఆరోపించారు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదించిన రూ.116 కోట్లలో రూ.80 కోట్లు భూ సేకరణకే పోతుందన్నారు. అలా స్కెచ్‌వేసిన కొండబాబును అడ్డుకున్నానని, భవిష్యత్‌లో కూడా ఆ ప్రతిపాదనను నిలిపివేసి మూడో వంతెనను తక్కువ వ్యయంతో నిర్మిస్తానన్నారు. సురేష్‌నగర్‌లో టీడీఆర్ బాండ్ల వ్యవహారాన్ని అనవసరంగా తనకు ముడిపెట్టి కొండబాబు ఆరోపిస్తున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో అప్పటి మున్సిపల్ అధికారులు చేసిన తప్పుల వల్ల ప్రైవేటు భూమిలో నిర్మాణాలు చేసి టీడీఆర్ ఇచ్చేందుకు అప్పట్లోనే అంగీకరించారన్నారు. సదరు భూమి యజమానిని కొండబాబు డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేసి అంగీకరించకపోవడంతో ఎదురుతిరిగి ఇప్పుడు తనపై ఆరోపణలు చేస్తున్నారంటూ మండిపడ్డారు.

మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ పట్ల తాను ఎప్పుడూ గౌరవ భావంతోనే వ్యవహరించానని చంద్రశేఖరరెడ్డి స్పష్టం చేశారు. దేవాలయాలను కూడా రాజకీయాలకు వాడుకుంటున్నారంటూ కొండబాబుపై మండిపడ్డారు. తన హయాంలో మత్స్యనారాయణస్వామి ఆలయం నుంచి సంతచెరువు దుర్గ గుడి, సాంబమూర్తినగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు మరెన్నో దేవాలయాలను అభివృద్ధి చేశానన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి సత్యప్రసాద్ మాట్లాడుతూ నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు ఏ మాత్రం విలువ ఇవ్వకపోవడం వల్లే 23 మంది కార్పొరేటర్లు ఆయనను విడిచి అభివృద్ధి కాముకుడైన ద్వారంపూడి వెంట నడిచామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒకటో తేదీ వచ్చిందంటే పండగే



కరపలో పింఛన్ చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే కన్నబాబు

కరప: గతంలో పండగలు వస్తున్నాయంటే పేదలు ఆర్థిక ఇబ్బందులతో ఆందోళన చెందేవారని, ఇప్పుడు ప్రతినెల ఒకటోతారీకు వచ్చిందంటే ఇంటి తలుపుతట్టి పింఛన్ చేతిలో పెట్టించి, ఆర్థిక భరోసా కల్పించి ప్రతి నెల పండగలా చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనారోగ్యం వచ్చిందంటే భయపడకుండా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ 25 లక్షలవరకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో రూ.5 లక్షలు ఉండే ఆరోగ్యశ్రీ పథకం నేడు రూ 25 లక్షలకు పెంచారన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో శనివారం కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు నెలవారీ పింఛన్ రూ 3 వేల వరకు పెంచుకుంటూ పోతామని చెప్పిన సీఎం జగన్ ఇచ్చినమాటను నిలబెట్టుకున్నారన్నారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన 185 పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులను ఎమ్మెల్యే కన్నబాబు లబ్ధిదారులకు అందజేశారు. మండల పరిధిలో 11,575 మందికి పింఛన్లు ఇస్తున్నట్టు తెలిపారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీడీఓ కె.అప్పారావు, కార్యదర్శి ఎస్‌కే.నాగేంద్రకుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నవరత్నాలు

కరప: ప్రతి కుటుంబానికి ప్రయోజనం కలిగించి, తద్వారా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ నవరత్నాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. ఇచ్చినహామీలన్నీ నెరవేర్చామని చెప్పేందుకే సీఎం జగన్ ఆదేశాల మేరకు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తోన్నమన్నారు. శనివారం ఆయన గురజనాపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. సర్పంచ్ అనసూరి శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కృష్ణమూర్తి, పబ్బినీడి పాపారావు, బెజవాడ బాబ్జీ, మామిడాల బాబీ, బొడ్డు అప్పారావు, పబ్బినీడి వీరబాబులు ఇంటింటికీ తీసుకెళ్లగా ఎమ్మెల్యే కన్నబాబు ఎవరికి ఏయే పథకాలద్వారా ఎంతమేర లబ్ధి చేకూరిందో వివరించి, సీఎం జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ ముందుకు సాగారు. అర్హత ఉండి ఎవరికైనా పథకాలు రాకపోతే తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాష్ట్రబాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీడీఓ కె.అప్పారావు, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వివిధ రకాల వ్యాధులు, ప్రమాదవశాత్తు పశువులు, జీవాలు మరణిస్తే రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకాన్ని రూపొందించిందని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఎస్.సూర్యప్రకాశరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారుల వాటా కింద రైస్ కార్డు ఉన్న రైతులు ప్రీమియం వాటాలో 20 శాతం, ఆర్థికంగా ఉన్న రైతులు 50 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పశువులకు మూడేళ్ల బీమా పథకం వర్తిస్తుందన్నారు. కాలయాపన లేకుండా పశువు మరణించిన 21 రోజుల లోపే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి పరిహారం జమ అయ్యేలా నిబంధనలు సడలించినట్టు తెలిపారు. ఏదైనా సాంకేతిక కారణాలతో పరిహారం జమ కాకపోతే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. దేశవాళీ, సంకర జాతి ఆడ, మగ పశువులకు రూ.30 వేల వరకు, నాటు జాతికి చెందిన ఆడ, మగ పశువులకు రూ.15 వేల వరకు, గొర్రెలు, మేకలకు రూ.6 వేల వరకు ప్రభుత్వ సబ్సిడీతో బీమా సౌకర్యం కలుగజేస్తున్నారు. లబ్ధిదారుడు ప్రభుత్వ నిర్ణీత బీమా మొత్తం కన్నా ఎక్కువ మొత్తానికి బీమా చేయించుకోదలచితే ఆ పై మొత్తానికి పూర్తి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఆవులు, గేదెలలో గరిష్ఠంగా రూ.1.2 లక్షలు వరకు, గొర్రెలు, మేకలకు గరిష్ఠంగా రూ.15 వేల వరకు బీమా చేయించుకునే సదుపాయం ఉందని, ప్రీమియం చేయించుకొనే రైతులు సమీపంలోని గ్రామ పశుసంవర్ధకశాఖ సిబ్బంది సంప్రదించాలని సూర్యప్రకాశరావు తెలిపారు.

200 ఎకరాల్లో జగనన్న మెగా కాలనీ

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- అభివృద్ధి పనులకు భూమిపూజ



చదును పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: మండలం గురజనాపల్లి వద్ద 200 ఎకరాల్లో జగనన్న మెగాకాలనీ ఏర్పాటుతో కొత్త గ్రామం వెలుస్తుందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ఉప్పు భూముల్లో కాలనీ ఏర్పాటుకు అనువుగా చదునుచేసే పనులకు ఆయన స్థానిక నాయకులు, అధికారులతో కలసి శనివారం భూమిపూజ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండే ఉప్పు భూముల్లో ఇళ్లస్థలాల పట్టాలిచ్చేందుకు మూడేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలకు సీఎం జగన్ చొరవతో అనుమతులు లభించాయన్నారు. కేంద్రానికి చెల్లించాల్సిన సొమ్ములు చెల్లించడంతో పట్టాలిచ్చేందుకు మార్గం సుగమమైందన్నారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో అర్హులందరికీ పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండు వారాల్లో నియోజకవర్గ పరిధిలోని 8 వేల మందికి పట్టాలిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. దీంతో నియోజకవర్గ పరిధిలో 32 వేల మందికి ఇళ్లస్థలాల పట్టాలు ఇచ్చినట్టుగా ఎమ్మెల్యే ప్రకటించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, సర్పంచ్ అనసూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, పబ్బినీడి పాపారావు, మామిడాల బాబీ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఈఆర్వో నాగనరసింహారావు

కాకినాడ: నియోజకవర్గ ఈఆర్ఓ సీహెచ్ నాగ నరసింహారావు శనివారం కౌంటింగ్, స్ట్రాంగ్‌రూమ్‌లను సందర్శించారు. స్థానిక జేఎన్‌టీయూ కళాశాలలోని క్యాంపస్‌ను పరిశీలించారు. ఎన్నికల అనంతరం ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ లతోపాటు, కౌంటింగ్ నిర్వహించే కేంద్రాలను కూడా పరిశీలించారు. ఆయన వెంట కాకినాడ, పిఠాపురం తహసీల్దార్లు సీతాపతిరావు, త్రినాథరావు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు మురళీకృష్ణ, కృష్ణ తదితరులున్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ

పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన నగరంలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. 1, 2, 3 సర్కిల్స్ పరిధిలో పర్యటించి పారిశుద్ధ్య కార్మికుల సమ్మె వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానికులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ జిలాని, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వాకలపూడిలో వై ఏపీ నీడ్స్ జగన్



సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేస్తున్న ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ రామాంజనేయులు

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి సచివాలయం–2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సచివాలయ పరిధిలో లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు వివరించారు. ముఖ్యఅతిథిగా మండల జేసీఎస్ కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నేత కరీం భాష, బీసీ కార్పొరేషన్ డైరెక్టరు అనుసూరి ప్రభాకర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్లపల్లి జగన్, నాయకులు వీధి విజయసారధి, చంద్రరావు, వీర్రాజు, తదితరులు పాల్గొని ఏపీకి మళ్ళీ జగనే కావాలని, పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు తీసుకున్న ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలన్నారు. అనంతరం స్మార్ట్ ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు.

జీవితంలో ఉన్నతికి తొలి అడుగు పదో తరగతి

బాలాజీచెరువు: విద్యార్థి జీవితంలో ఉన్నతికి తొలిమెట్టు పదో తరగతి అని జేఎన్‌టీయూకే డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. శ్రీనగర్ అడ్వాన్స్‌డ్ ఫౌండేషన్ మున్సిపల్ పాఠశాలలో శనివారం పదవ తరగతి విద్యార్థులకు ఒరియంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ జీవిత లక్ష్య నిర్దేశం పదో తరగతి నుంచే ప్రారంభమౌతుందని, మనకు ఆసక్తి ఉన్న సబ్జెక్టులపై పట్టు సాధించి ఉన్నత విద్యకు ఇక్కడే పునాది వేయాలన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రొఫెసర్ మురళీకృష్ణను సత్కరించారు. ప్రిన్సిపాల్ నేతల నూకరాజు, ఉపాధ్యాయులు రామకృష్ణ, అర్జునరావు, సూర్యకుమారి పాల్గొన్నారు.